సాక్షి ములుగు

సోమవారం । 20 । మార్చి । 2023



బురదమయంగా రహదారులు

జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగారంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి రహదార్లు బురదమయంగా మారాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో▶



రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

వాజేడు మండలం అరుణాచలపురంలో సీసీ రోడ్డు వేసే సమయంలో రహదారి మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించకుండానే సీసీ రోడ్డును వేయడం గమనార్హం.

- 9లో▶

గరిష్టం/కనిష్టం

28.0^{0} / 20.0^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రి పూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

25 నుంచి ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు



కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25, 27, 29, 31, ఏప్రిల్ 3, 6, 10 తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి, దౌత్‌పల్లి ప్రధాన రహదారి వద్ద ఆదివారం మహాముత్తారం ఎస్సై సుధాకర్ వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనపత్రాలను పరిశీలించి అనుమానితులతో మాట్లాడి వదిలేశారు. ఎస్సై వెంట సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

వైన్స్ ఎదుట ఆందోళన



కాటారం: అధిక ధరలకు మద్యం విక్రయించడంతో పాటు, కల్తీ మద్యం విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ఆదివారం మండలకేంద్రంలోని వైన్స్ ఎదుట పలువురు యువకులు ఆందోళన చేపట్టారు. వైన్స్‌ను మూయించి నిరసన వ్యక్తం చేశారు. మద్యం దుకాణంలో సరైన బ్రాండ్‌లు అమ్మకుండా బెల్టు దుకాణాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కల్తీ మద్యం ఏరులై పారుతున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వైన్‌షాపును సీజ్ చేసి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో చీమల రాజు, శ్రీహరి పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి



భూపాలపల్లి రూరల్: అకాల వర్షాలు, వడగళ్ల వాన కారణంగా జిలాల్లో నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా కన్వీనర్ కర్నాటకపు సమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు సంవత్సరాలుగా పంటలకు నష్టపరిహారం ఇవ్వడం లేదన్నారు. కేంద్రం నష్టపరిహారం ఇవ్వడానికి రూ.188కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినా రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. పంటల బీమా అమలు చేయకపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. కౌలు రైతులు మాత్రం పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

31న హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు

వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 31న నిర్వహించనున్నట్లు అడ్‌హక్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో మొత్తం 803 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. 20న అధికారిక ఓటరు జాబితా ప్రకటన, 21న నామినేషన్ల దాఖలు, 23న పరిశీలన, 24న విత్‌డ్రాలు, 27న అభ్యర్థుల పరిచయ వేదిక, 31న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, సాయంత్రం ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు వెల్లడించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా.. నూతనంగా ఏర్పాటైన హనుమకొండ బార్ అసోసియేషన్ తాత్కాలిక అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి వి.నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. అడ్‌హక్ కమిటీలో సభ్యులుగా బి.శ్రీనివాస్‌రెడ్డి, టి.రవీందర్‌రావు, జి.మల్లికార్జున్, సీహెచ్.రామకృష్ణ, సీహెచ్.భాగ్యమ్మలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అకాల నష్టం

వర్షంతో రైతన్న ఆగమాగం

- గోదావరి తీరంలో నీటమునిగిన మిర్చి
- జిల్లా వ్యాప్తంగా నేలవాలిన మొక్కజొన్న
- పలుచోట్ల దెబ్బతిన్న వరి పంట

ములుగు: తుఫాన్ ప్రభావంతో శనివారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు జిల్లా వ్యాప్తంగా వర్షం పడింది. ముఖ్యంగా ఏజెన్సీలోని గోదావరి తీరం వెంబడి ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె), మంగపేటతోపాటు వెంకటాపురం(ఎం) మండలాల్లోని కల్లాల్లో ఆరబోసిన మిర్చి పూర్తిగా తడిసిపోయింది. కల్లంలోకి వరద నీరు రావడంతో మిర్చి కొట్టుకుపోయింది. పంటను కాపాడుకోవడానికి రైతులు రాత్రంతా నానాతంటాలు పడ్డారు. కొట్టుకుపోయిన మిర్చిని కల్లంలోకి పోయడానికి చెమటోడ్చాల్సి వచ్చింది. గాలిదుమారం, ఈదురు గాలులు ఎక్కువగా వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో రాత్రి పూట ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. ఇక ములుగు మండలం అబ్బాపూర్, శ్రీరాములపల్లి, మల్లంపల్లి, పందికుంట, జాకారం, మహ్మద్‌గౌస్‌పల్లి, రామచంద్రాపురం, వెంకటేశ్వర్లపల్లి, కొడిశలకుంట, ఏసునగర్ వంటి ప్రాంతాల్లో పూతకు వచ్చిన మొక్కజొన్న పంట దెబ్బతిన్నది. జిల్లాలో వెంకటాపురం(కె) మండలంలో అత్యధికంగా 102.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా వాజేడు మండలంలో 13.8 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైనట్లు సమాచారం.

మరిన్ని చిత్రాలు 9లో▶

వెంకటాపురం(కె): నేలమట్టమైన మొక్కజొన్న



నీట మునిగిన పంటలు.. విరిగిన స్తంభాలు

వెంకటాపురం(కె): అకాల వర్షంతో మండలంలో అపార నష్టం వాటిల్లింది. మిర్చి పంట తడిసి ముద్దయింది. గాలివానతో మొక్కజొన్న నెల మట్టమైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందవచ్చే సమయంలో వచ్చిన వర్షానికి పంటలు నష్టపోయి అన్నదాతలు కుదేలయ్యారు. మిర్చి రాశులపై రైతులు తాటాకులు, టార్పాలిన్‌లు కప్పారు. శనివారం రాత్రి వచ్చిన గాలివానకు మండలంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. దీంతో మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గోదావరి పాయలో రైతులు ఆరబోసిన మిర్చి పంట వర్షానికి నీట మునగడంతో రైతులు నీటిలోని మిరప కాయలను తీసి అరబోసుకునేందుకు ఇబ్బందిపడ్డారు.

వర్షపాతం వివరాలు

మండలం	మిల్లీ మీటర్లలో..
ములుగు	54.2
వెంకటాపురం(ఎం)	61.6
గోవిందరావుపుట	69.4
ఎస్ఎస్ తాడ్వాయి	82
ఏటూర్‌నాగారం	50.2
వెంకటాపురం(కె)	102.2
మంగపేట	70
కన్నాయిగూడెం	28.4
మొత్తం	518



వెంకటాపురం(కె): నీటిలోని మిరపకాయలను ఏరుతున్న రైతులు

అన్నదాతలకు వానదెబ్బ

వాజేడు: ఆరుగాలం కష్టించి పండించిన పంటలు వర్షం కారణంగా దెబ్బ తిన్నాయి. వాజేడు మండలంలో శనివారం రాత్రి 8 గంట నుంచి తెల్లవారే వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మిర్చి, వరి, మొక్క జొన్న ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. మిర్చి కల్లాలోనికి నీరు చేరడంతో రైతులు తలలు పట్టుకున్నారు. చేతికి అంది వచ్చిన పంట వర్షార్పణం కావడంతో పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన చెందుతున్నారు. బరకాల(పరదాలు)ను వేసి మిర్చి పంటను రక్షించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ముందుగా వచ్చిన గాలికి బరకాలు లేచిపోయాయి. దీంతో మిర్చి నానిపోయింది. వర్షానికి వరి కంకులు వంగడంతో పంట చేతికి వస్తుందా లేదా అని రైతులు భయపడుతున్నారు. పలుచోట్ల మొక్కజొన్న, వరి పంటలు నేలవాలాయి.



కల్లంలో చేరిన నీరు

తల్లడిల్లిన మిర్చిరైతు

కన్నాయిగూడెం: మండలంలో గత మూడు రోజులుగా మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. బుట్టాయిగూడెం, చింతగూడెం, సింగారం, కన్నాయిగూడెం, గూర్రేవుల, ముప్పనపల్లిలో ఉరుములు-మెరుపులతో కూడిన వర్షం పడుతుంది. దీంతో కల్లాల్లో రైతులు కోసి పోసిన మిర్చి పూర్తిగా తడిసిపోవడంతోపాటు పంటలు దెబ్బతింటున్నాయి. వాటిని రక్షించడానికి రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. కల్లాల్లో ఉన్న మిర్చిని కాపాడడానికి రైతులు టార్పాలిన్ కోసం అప్పులు చేసి షాపుల్లో కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు అధిక ధరలకు టార్పాలిన్లను రైతులకు విక్రయిస్తున్నారు. రైతులకు వ్యవసాయ శాఖ సబ్సిడీలో టార్పాలిన్లు అందించాలని కోరుతున్నారు.



మిర్చి కల్లంలో కప్పిన టార్పాలిన్‌పై నిలిచిన నీరు

ఏటూరునాగారం: పరదాలపై నిలిచిన నీరు



వణుకుతున్న ఏజెన్సీ

ఏటూరునాగారం: ఏజెన్సీలో కురిసిన వర్షానికి మిరప రైతులు అతాలకుతలమయ్యారు. ఆరుగాలం పండించిన పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. టార్పాలిన్, తాడిపత్రులు కల్పినప్పటికీ కాయలు మెత్తపడడంతో నెత్తినోరు కొట్టుకుంటున్నారు. శనివారం కురిసిన రాళ్ల వర్షానికి మిర్చి పంట దెబ్బతిన్నది. మిరప కల్లాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. కాయలను తిరగబోసి ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. శివాపురంలో అతిగా రాళ్ల వర్షం కురిసినట్లు తెలిసింది. మండల కేంద్రంలో పలు వీధుల్లో నిర్మించిన సీసీ రోడ్లు కంకరతేలి దర్శనమిచ్చాయి. కాంట్రాక్టర్లు శనివారం సిమెంట్ రోడ్లను నిర్మించగా రాత్రి కురిసిన భారీ వర్షానికి సిమెంట్ అంతా కొట్టుకుపోయి కంకరతేలింది. కొన్ని చోట్ల రోడ్డుకు పెట్టిన రైలింగ్ చెక్కలు ఊడిపోయి రోడ్లు ఉర్లిపోయాయి. డీఈఈ, ఏఈఈ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇంజనీరింగ్ అధికారులు కమిషన్లకు మాత్రమే చొరవ చూపుతున్నారని, పనుల విషయంలో పెద్దగా పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. సిమెంట్ రోడ్ల దుస్థితిని ఇంజనీరింగ్ అధికారులకు సమాచారం ఇస్తే కాంట్రాక్టర్లకు వత్తాసు పలకడం గమనార్హం. ఏటూరునాగారం ప్రధాన రోడ్లు బురదమయంగా మారాయి. సాయిబాబా గుడి ముందు, ఖలీల్‌మెడికల్ స్టోర్ వద్ద నీరు నిల్వడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చెరువును తలపించే విధంగా నీరు చేరింది.



ఏటూరునాగారం: జెడ్పీహెచ్ఎస్‌లో నిలిచిన వర్షపు నీరు

మేడారంలో మొక్కుల సందడి



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



కుటుంబ సమేతంగా..

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క సారలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జంపన్నవాగులో స్నానాలు అచరించి తలనీలాలు సమర్పించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర సారె, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆడెపు చిరంజీవి కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. శనివారం రాత్రి భారీ వర్షం కురిసినా భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు మేడారానికి తరలివచ్చారు. భక్తుల రద్దీతో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం సందడిగా మారింది. భక్తులు మేడారం పరిసరాల్లోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు ఆరగించారు. దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్లు రఘుపతి, రమాదేవి భక్తులకు సేవలందించారు.

గూడెంలో సోలార్ వెలుగులు



ఎస్ఎస్ తాడ్వాయి : సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్న సతీష్‌రెడ్డి



పస్రా అటవీ ప్రాంతంలో..

ఎస్ఎస్ తాడ్వాయి/ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం పస్రా పంచాయతీ పరిధి అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గొత్తికోయలకు, ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని జలగలంచ గూడెంలోని గొత్తికోయలకు రెడ్‌కో చైర్మన్ సతీష్ రెడ్డి సోలార్ లైట్లను అందించారు. తెలంగాణ రాష్ట్ర రెడ్ కో చైర్మన్ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోలార్ లైట్లను ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎస్పీ గౌస్ ఆలం, ఓఎస్డీ అశోక్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ చేతుల మీదుగా 46 సోలార్ లైట్లను పంపిణీ చేశారు. పిల్లలకు బిస్కెట్లను కూడా అందజేశారు. గూడెంలోని ప్రతి కుటుంబానికి రెండు సోలార్ లైట్లను పంపిణీ చేసినట్లు రెడ్ కో చైర్మన్ సతీష్‌రెడ్డి తెలిపారు. గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్‌లోని గొత్తికోయ గూడెంలో 40 సోలార్ లైట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. గూడెంలోని గొత్తికోయ కుటుంబాలకు సోలార్ లైట్లు పంపిణీ చేసిన రెడ్ కో చైర్మన్ సతీష్‌రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు. సోలార్ లైట్ల ను సద్వినియోగం చేసుకోవాలని గొత్తికోయలకు సూచించారు. గూడేల్లో ఎలాంటి అవసరాలు ఉన్న స్థానిక నాయకులు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి, గ్రంథాలయ చైర్మన్ గోవింద్‌నాయక్, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ములుగు రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర రెడ్‌కో చైర్మన్ సతీష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పత్తిపల్లిలోని సబ్ సెంటర్‌ను ఆయన పరిశీలించి, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పని చేస్తుందని అన్నారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో శ్రద్ధ వహించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సబ్ సెంటర్‌లో విద్యుత్ దీపాలు, ఫ్యాన్ల ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పత్తిపల్లి ఎంపీటీసీ సభ్యుడు నూనావత్ మహేష్‌నాయక్, గ్రంథాలయ చైర్మన్ గోవింద్, భూక్య మురళి, వినయ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సతీష్‌రెడ్డి

ప్రజల నడ్డివిరుస్తూ కార్పొరేట్‌కు సహకారమా..?

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం కార్యకర్తలు



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

వాజేడు/వెంకటాపురం(కే): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని చెప్పి నేడు కార్పొరేట్ వ్యవస్థను బలోపేతం చేస్తూ పేదల బతుకులు ఛిద్రం చేస్తుందని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ప్రజాచైతన్య బస్సు యాత్రలో భాగంగా వాజేడుకు వచ్చిన ఆయన కొమరం భీమ్ సెంటర్లో బహిరంగ సభలో ప్రసంగించారు. వాజేడుకు వస్తున్న ఆయనకు ద్విచక్రవాహనాల ద్వారా భారీ ర్యాలీతో సీపీఎం కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలు లేని భారతదేశాన్ని తయారు చేస్తానని నమ్మబలికి గద్దెనెక్కిన మోదీ నేడు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చేనాటికి రూ.400 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.12,00 కు చేరుకుందని విమర్శించారు. రైతులకు డబుల్ ఆదాయం ఇస్తానని చెప్పిన పెద్దమనిషి నేడు మూడు నల్ల చట్టాలకు తీసుకొచ్చి రైతన్నతో చెలగాటం ఆడుతున్నాడని విమర్శించారు. విదేశాల నుంచి నల్లడబ్బును తీసుకొచ్చి ప్రతీ మహిళ ఖాతాలో రూ.15 లక్షల నగదును జమ చేస్తానన్న మోదీ మాట తప్పాడని విమర్శించారు. తమ పాలనలో ప్రతీ ఒక్కరికి పక్కా ఇళ్లు కట్టిస్తానని చేసిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చక పోగా కార్మికులు, కర్షకులు, రైతులు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలతో పాటు దళితులను పట్టించుకోవడం లేదన్నారు. కేవలం అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కట్ట బెడుతూ వారిని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ఎరువులపై సబ్సిడీని తగ్గించి రైతులకు భారం పెంచడంతో ఎరువులను కొనుక్కో లేని పరిస్థితికి రైతులు వచ్చారని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాన మంత్రి మాట నిలుపుకోలేకపోగా నిరుద్యోగులను తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గించి కూలీల కడుపు కొడుతున్నారన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చే విషయంలో ప్రభుత్వాలు మీన మేశాలను లెక్క పెడుతు గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ మూలంగా భద్రాచలం నియోజకవర్గంతో పాటు బూర్గంపహడ్, పినపాకలకు సైతం ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వాజేడు మండలంలోని మోడికుంట, గుండ్ల వాగు ప్రాజెక్టులను పట్టించుకోకపోగా పాలెం ప్రాజెక్టుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రతిపక్షపార్టీగా కాకుండా ప్రజలను బీజేపీ ప్రభుత్వం ఏ స్థాయిలో ఇబ్బందులకు గురి చేస్తుందో తెలియజెప్పడానికే ప్రజా చైతన్య బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు సీపీఎం భద్రాచలం కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ నెల 29న హైదరాబాద్‌లో భారీ ఎత్తున బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, యాత్ర ఆదివారం సాయంత్రం వెంకటాపురం మండలానికి చేరుకోగా.. బర్లగూడెం సమీపంలో నాయకులు స్వాగతం పలికారు. ఈ ప్రజా చైతన్య బస్సుయాత్రలో సూడి కృష్ణారెడ్డి, దబ్బకట్ల లక్ష్మయ్య, కొప్పుల రఘుపతి, వెంకటరెడ్డి, కృష్ణ బాబు, కుమ్మరిశ్రీను, కట్ల చారి తదితరులు పలాల్గొనారు.

పట్టుదలే మనోధైర్యం

పోరాడితేనే హక్కులు సాధిస్తాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి

నిలిచిన దేవాదుల పంపింగ్

- 10లో▶

మత సామరస్యానికి ఉద్యమించాలి

ఏటూరునాగారం: సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం జనచైతన్య యాత్ర ర్యాలీని సీపీఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదం రెచ్చగొడుతుందన్నారు. ప్రజలపై అధిక ధరలను మోపి జీవించే శక్తి లేకుండా చేస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సొంత ఇల్లు ఇవ్వలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. పంటలు దెబ్బతింటే పరిహారం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని చట్టం చెబుతున్నా.. తెలంగాణ ప్రభుత్వం ఒక్క పట్టా ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యుడు దావూద్, నాయకులు పాల్గొన్నారు.



యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

బీజేపీకి ఓట్లడిగే హక్కు లేదు

న్యూశాయంపేట: విభజన హామీలు నెరవేర్చని బీజేపీకి ఓట్లు అడిగే హక్కు లేదని, తెలంగాణ అభివృద్ధిలో బీజేపీది ప్రేక్షక పాత్ర అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలు అమలు చేయకుండా బీజేపీ నిర్లక్ష్యం చేసిందన్నారు. బీజేపీ, ఎన్డీయే వైఖరిని ఎండగట్టేందుకు ఉమ్మడి జిల్లాలో పార్టీ ప్రజా పోరు పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు, ఇందులో 150 మంది పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈపాదయాత్ర ఈనెల 25న బయ్యారంలో ప్రారంభమై వచ్చే నెల 5న హనుమకొండలో ముగుస్తుందన్నారు. ×కుడా× మైదానంలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో వడగళ్లు, అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి సహాయం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు మండల స్థాయిలో అధికారులచే కమిటీలు వేసి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసమావేశంలో నాయకులు నేదునూరి జ్యోతి, టి.శ్రీనివాస్‌రావు, పోతరాజు సారయ్య, కర్రె భిక్షపతి, మేకల రవి, రాజారెడ్డి, విజయసారథి, విశ్వేశ్వర్‌రావు, రమేశ్, షేక్‌బాషుమియా, ఎల్లేశ్, శ్రీనివాస్, అనిల్, లక్ష్మణ్, సంతోశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంగెం : మద్యానికి బానిసై ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గవిచర్లకు చెందిన కడారి రాజు అలియాస్ శివ(30)కు భార్య నవ్య, కుమారుడు విక్కి, కూతురు మిన్ని ఉన్నారు. నక్కలపల్లి రైస్‌మిల్లులో హమాలీగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నెల నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. నవ్య తల్లికి కంటి ఆపరేషన్ కావడంతో ఈ నెల 11న పిల్లలను తీసుకుని నెక్కొండ మండలం పత్తిపాకలోని తల్లిగారింటికి వెళ్లింది. రాజు మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఈ నెల 15న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే నవ్య మామ ఎల్లయ్యకు ఫోన్‌లో విషయం చెప్పడంతో ఆయన హుటాహుటిన ఆటోలో ఎంజీఎంకు తరలించాడు. చికిత్స పొందుతున్న శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

టేకుమట్ల(రేగొండ): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేగొండ మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..గన్‌రెడ్డి రవీందర్‌రెడ్డి(50) తన భార్య మరణం అనంతరం గత కొన్ని నెలలుగా మానసికంగా తీవ్ర మనోవేదనకు గురై ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది.


సత్యనారాయణ (ఫైల్)

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన శాగ సత్యనారాయణ (52) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానిక ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సత్యనారాయణ ఉదయం స్టేషన్‌ఘన్‌పూర్‌లో పని ఉండడంతో యాక్టివా బైక్‌పై వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా చిన్నపెండ్యాల గ్రామసమీపంలోని గేమ్యతండా క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే వెనకాలే వేగంగా హైదరాబాద్ నుంచి హన్మకొండకు వెళ్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొనడంతో సత్యనారాయణ ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి గురైన కారుడ్రైవర్ హస్తవరం శరత్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కారును పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలియగానే మత్స్యపారిశ్రామిక సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు నీల రాజు సంతాపం తెలిపారు.

అన్నకు వైద్యం చేయించేందుకు వెళ్తూ తమ్ముడు..


మల్లయ్య(ఫైల్)

నల్లబెల్లి: తోడబుట్టిన బంధంతో అన్నకు దగ్గరుండి వైద్యం చేయించేందుకు వెళ్తున్న తమ్ముడు రోడ్డు ప్రమాదంలో శనివారం రాత్రి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంపూర్‌కు చెందిన 1వ వార్డు సభ్యుడు తక్కళ్లపల్లి మల్లయ్య(మల్లన్న) (44) తన అన్న సంపత్‌రావుకు పక్షపాతంతో కాళ్లు, చేతులు శనివారం సాయంత్రం పనిచేయలేదు. గమనించిన కుటుంబ సభ్యులు ఆటోలో నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తమ్ముడు ఆస్పత్రికి వెళ్లి దగ్గరుండి చికిత్స చేయించేందుకు ద్విచక్రవాహనంపై ఇంటినుంచి నర్సంపేటకు శనివారం రాత్రి బయలుదేరాడు. ఈ క్రమంలో నర్సంపేట మండలంలోని ఆకులతండా వద్ద ఎద్దు ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకొచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స అందించేందుకు వైద్యులు ప్రయత్నిస్తుండగా మృతి చెందాడు. మల్లయ్య మృతితో రాంపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..


రాములు మృతదేహం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని ఇల్లందు రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందాడని టౌన్ ఎస్సై బైరు గోపి ఆదివారం తెలిపారు. డోర్నకల్ మండలం చిలుకోడుకు చెందిన తాటి రాములు (52) మేస్త్రి పని ముగించుకుని ఇల్లందులోని బంధువుల ఇంటికి ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఇల్లందు రోడ్డులోని రామన్నపేట కాలనీ మూలమలుపు వద్ద నిలబడగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న టౌన్ ఎస్సై గోపి, బ్లూకోల్ట్స్ పీసీలు రమేష్, నరేష్ సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన రాములును చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సైకిల్‌పై నుంచి కిందపడి వ్యక్తి..

కమలాపూర్: మండలంలోని అంబాలకు చెందిన ఎండీ.రహీముద్దీన్ (49) సైకిల్‌పై నుంచి కిందపడి శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై మోటం సతీష్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాండ్ వాయిస్తూ జీవనం సాగించే రహీముద్దీన్ ఈ నెల 18న మండలంలోని శ్రీరాములపల్లిలో బ్యాండ్ వాయించి రాత్రి సమయంలో సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షలు నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య రజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరాజుపల్లిలో బీజేపీ నాయకుడు..


సోమనర్సింహారెడ్డి (ఫైల్)

దేవరుప్పుల : జనగామ–సూర్యాపేట రహదారి సింగరాజుపల్లి పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ సీనియర్ నాయకుడు లేగ సోమనర్సింహారెడ్డి(62) మృతి చెందాడు. మండలంలోని నీర్మాలకు చెందిన సోమనర్సింహారెడ్డి మోటారు సైకిల్‌పై ఇంటి సామగ్రి నిమిత్తం సింగరాజుపల్లిలో జనగామ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిన్నమడూరుకు చెందిన కాముని మహేష్ బంజర నుంచి సింగరాజుపల్లికి వస్తుండగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. నర్సింహారెడ్డికి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఉమ, ఒక కుమార్తె, ఇద్దరు కొడుకులు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

బీజేపీ నాయకుల సంతాపం

బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి అకాల మరణంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రాష్ట్రనాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్, అధికార ప్రతినిధి చింత సృజన్, మండల అధ్యక్షుడు బాగాల నవీన్‌రెడ్డి, నల్ల వెంకటేశ్వర్లు, కాసాని సత్తయ్య తదితరులు సంతాపం తెలిపారు.

క్రమశిక్షణ లేకుంటే చర్యలు

- తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్‌యాదవ్



మాట్లాడుతున్న జగదీశ్‌యాదవ్

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారులే కాదు.. ఆయా జిల్లాల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సైతం క్రమశిక్షణ లేకుండా వ్యవహరిస్తే చర్యలు తప్పవని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్‌యాదవ్ హెచ్చరించారు. హనుమకొండ సుబేదారిలోని రాయల్ గార్డెన్స్‌లో ఆదివారం హనుమకొండ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జగదీశ్‌యాదవ్ మాట్లాడుతూ ఆటల్లో రాణించాలంటే ప్రతిభతోపాటు క్రమశిక్షణ తప్పనిసరిగా అలవర్చుకోవాలన్నారు. ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిన కబడ్డీ క్రీడాకారులు, అసోసియేషన్ బాధ్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. టోర్నమెంట్లు నిర్వహించిన సమయంలో క్రీడాకారులు తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటించాలన్నారు. ఏ జిల్లాకు చెందిన క్రీడాకారుడు ఆ జిల్లా జట్టుకే ప్రాతినిధ్యం వహించాలని, లేదంటే ఆడాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. ఇటీవల కాలంలో వనపర్తి, టంగుటూరు, మెదక్ తదితర జిల్లాల అసోసియేషన్లు, క్రీడాకారుల తీరు సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని ప్రతీ సంఘం బాధ్యుడు, క్రీడాకారులు నిబంధనలకు లోబడి క్రమశిక్షణతో మసలుకోవాలని సున్నితంగా హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి రాములు, ఉపాధ్యక్షుడు మహ్మద్ అజీజ్ ఖాన్, కర్తయ్య, కిష్టయ్య, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఆకుల సారంగపాణి, సోదా రామకృష్ణ, క్రీడా సంఘం బాధ్యులు గద్దం రమేశ్ గౌడ్, సంపత్‌రావు, కొత్త కృష్ణారెడ్డి, అక్రంఖాన్, అబ్దుల్లా ఖాన్, బిన్ని లక్ష్మణ్, కందుల సృజన్‌కాంత్, నలుబోలు సతీశ్, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

వీబీఆర్ బార్‌లో లీగల్ మెట్రాలజీ తనిఖీలు

- రెండు కేసులు నమోదు


కేసు నమోదు చేస్తున్న అధికారి అనిల్‌కుమార్

వరంగల్: హనుమకొండ నక్కలగుట్టలోని వెంకటేశ్వర బార్ అండ్ రెస్టారెంట్‌లో ఆదివారం లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం లూజ్ అమ్మకాల్లో 60 ఎంఎల్ మద్యానికి 50 ఎంఎల్ రావడంతో పాటు బార్‌లో వాటర్‌బాటిల్‌ను ఎంఆర్‌పీ కంటే రూ.10లు ఎక్కువగా అమ్మినట్లు నిర్ధారణ కావడంతో రెండు కేసులు నమోదు చేసినట్లు లీగల్ మెట్రాలజీ అధికారి ఎం.అనిల్‌కుమార్ తెలిపారు. బార్‌లో మద్యం కొలిచే పావులకు లీగల్ మెట్రాలజీ ఆమోదం లేదని, అవి పాతవి కావడం, రెన్యూవల్ చేయకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు. వైన్స్‌లో ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు



వినోద్‌ను అరెస్టు చూపిస్తున్న సీఐ విశ్వేశ్వర్

పాలకుర్తి టౌన్: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు సీఐ డి.విశ్వేశ్వర్ తెలిపారు. ఆదివారం సీఐ కార్యాలయంలో ఎస్సై తాళ్ల శ్రీకాంత్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లింగాల ఘనపురం మండలం చీటూరుకు చెందిన వాతాల రీణా, పాలకుర్తి మండలం శాతాపురం గ్రామానికి చెందిన లకావత్ వినోద్(మోహన్) ప్రేమించుకున్నారు. వినోద్ పెళ్లి చేసుకుంటానని రీణాను లొంగదీసుకున్నాడని తెలిపారు. ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా మరో యువతిని వివాహం చేసుకున్నాడని తెలిపారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో పనిచేస్తున్న రీణా ప్రేమించిన వ్యక్తి మరో యువతిని పెళ్లి చేసుకున్నాడని తెలుసుకొని శాతాపురం గ్రామానికి చేరుకొని యువకుడి ఇంటికి వెళ్లగా అతని తల్లిదండ్రులు, అక్క, బావతో కలిసి కొట్టి గాయపర్చారు. యువతి పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని వినోద్ కోసం వెతకగా పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆర్చి వద్ద ఉన్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి


మృతి చెందిన పాడిగేదె

ధర్మసాగర్: మండల కేంద్రంలో శనివారం రాత్రి అకాల వర్షంతో పాటు పిడుగుపాడి పాడి గేదె మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బొల్లం రాజు తన పాడి గేదెలను శనివారం సాయంత్రం ఇంటి సమీపంలోని ఓ చెట్టుకు కట్టేసి వెళ్లాడు. అయితే అదే రోజు రాత్రి గేదెపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

దుక్కిటెద్దు మృతి

వేలేరు మండలంలోని మద్దెలగూడెం గ్రామానికి చెందిన రైతు చొప్పరి రాజుకు చెందిన రెండు దుక్కిటెద్దు పిడుగు పాటుకు గురై మృతి చెందాయి. సుమారు రూ.1.30 లక్షల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

55 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలను తీసుకెళ్తున్న రైతు

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి, గురిజాల గ్రామాల్లో మొత్తం 55 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు గురిజాల, లక్నెపల్లి గ్రామ శివారులోని మగ్రినర్సయ్యపల్లికి చెందిన పలువురు రైతులకు చెందిన 55 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన గొర్రెలను గ్రామ శివారులోని పాతిపెట్టారు.

మూడు రోజులు శాతవాహన సూపర్‌ఫాస్ట్ రద్దు



కాశిబుగ్గ : విజయవాడ సెక్షన్‌లోని గంగినేని, ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ల మధ్య జరుగుతున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేస్తునట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. విజయవాడ నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి విజయవాడ మధ్య వరంగల్, కాజీపేట మీదుగా నడిచే శాతవాహన సూపర్ ఫాస్ట్ (12713, 12714)ను ఈనెల 20నుంచి 22 వరకు మూడు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మరికొన్ని రైళ్ల మధ్య దూరం తగ్గిస్తున్నట్లు, మరికొన్ని రైళ్లు దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. అదేకాకుండా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరంగల్, కాజీపేట సెక్షన్ల పరిధిలో ఈదురు గాలులకు పలురైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్లు విరిగి పడటంతో గూడ్స్ రైళ్లతో పాటు ప్యాసింజర్ రైళ్లకు అంతరాయం కలిగిందని అధికారులు తెలిపారు.

చెట్టుపై పిడుగు పడి రైతు మృతి

- మరో రైతుకు తీవ్రగాయాలు


శంకర్(ఫైల్)

గూడూరు: అడవి జంతువుల నుంచి పంటను కాపాడుకునేందుకు వెళ్లిన ఇద్దరు రైతులు అకాలవర్షంతో తలదాచుకోగా పక్కనే ఉన్న చెట్టుపై పిడుగుపడి చెట్టు కూలి వారిపై పడింది. దీంతో ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన చిన్నఎల్లాపురం శివారు హేముతండాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తండాకు చెందిన ధరంసోత్ శంకర్(43) మరో రైతు జరుపుల శీర్యానాయక్ ఇద్దరు మొక్కజొన్న పంటను అడవి పందుల నుంచి రక్షించుకోవడానికి రోజు రాత్రి కాపలా వెళ్తుంటారు. శనివారం అర్ధరాత్రి భారీ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగళ్ల వర్షం కురిసింది. వడగళ్ల నుంచి ప్రాణాలను రక్షించుకోవడానికి పక్కనే పెద్ద చెట్టు పక్కన ఉన్న సమాధి గుడి పక్కన తలదాచుకున్నారు. ఈ క్రమంలో పిడుగు పడడంతో మంటలతో చెట్టు కూలి వారు ఉన్న ప్రదేశం వైపు పడింది. దీంతో శంకర్ అక్కడికక్కడే మృతిచెందగా.. శీర్యానాయక్ రెండు కాళ్లు విరిగిపోయాయి. వర్షం తగ్గడంతో శీర్యానాయక్ కొడుకు భద్రు కాపలావెళ్లిన తండ్రి ఇంకా రాలేదని, పంటవైపు వెళ్లి చూశాడు. అక్కడ కూలిన చెట్టు కింద శంకర్ చనిపోయి..తండ్రి కాళ్లు విరిగి, మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. వెంటనే తండావాసులకు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు శీర్యానాయక్‌ను గూడూరు, మహబూబాబాద్ ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స అందించి వరంగల్‌లోని గార్డియన్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సతీష్‌గౌడ్ తెలిపారు.

ముగిసిన మహిళా క్రికెట్ ఎంపికలు


ఎంపిక పోటీల్లో పాల్గొన్న మహిళా క్రికెటర్లు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాజీపేటలోని సెయింట్ గాబ్రియేల్ స్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి మహిళా క్రికెటర్ల ఎంపిక పోటీలు ముగిశాయి. భారత మాజీ క్రికెట్ కోచ్‌లు రవిశాస్త్రీ, అరుణ్, శ్రీధర్ నేతృత్వంలో హిందూస్తాన్ యునిలివర్ లిమిటెడ్ కలిసి నిర్వహిస్తున్న బియాండ్ శిక్షణలో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. బియాండ్ సంస్థ అధికారిక సెలక్టర్లు బెంజన్సన్, అనుపపాయి శ్రీనివాస్, హర్ష నారాయణ, నెమలి శ్రీనుల బృందం తెలంగాణలో మొత్తం 5 రీజినల్ సెంటర్లలో జరిపిన ఎంపికల అనంతరం అత్యుత్తమ ప్రతిభకనబర్చిన 25 మందిని ఎంపిక చేసి మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్‌తో పాటు పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తారని తెలిపారు.

చర్చలతో సమస్యలు పరిష్కరించుకోవాలి

- ఘనంగా వరల్డ్ పీస్ పొయెట్స్ మీట్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్, తదితరులు

హన్మకొండ కల్చరల్: ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య యుద్ధం జరుగుతోందని చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం సాయంత్రం హోటల్ అశోకా కన్వెన్షన్ హాల్‌లో వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో వరల్డ్ పీస్ పోయెట్స్ మీట్ జరిగింది. ప్రపంచ శాంతిని కోరుతూ.. 'ఈ యుద్ధాలు ఎవరి కోసం' అనే అంశంపై బహుభాషా సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినయ్ భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ ఓరుగల్లు కవులకు, కళాకారులకు నిలయమన్నారు. శాంతిని ప్రబోధించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సిరాజుద్దీన్‌ను అభినందించారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న కేయూ వీసీ రమేశ్ మాట్లాడుతూ.. కవులు సాహితీ లోకానికి, సమాజానికి వివిధ రూపాల్లో సేవలందించడం అపూర్వమన్నారు. విశిష్ట అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, ప్రముఖ కవి రామాచంద్రమౌళి పాల్గొని ప్రసంగించారు. కవులు ఆలపించిన కవితలు అలరించాయి. పాల్గొన్న కవులను సన్మానించి ప్రశంసపత్రాలు అందజేశారు. శాంతిని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకులు మహమ్మద్ సిరాజుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో.. ప్రొఫెసర్ గూడా నరసింహమూర్తి, విజయబాబు, శ్రీపాద సుధాకర్‌రావు, నిమ్మల శ్రీనివాస్, కొమర్రాజు రామలక్ష్మి, ఘంటా రామిరెడ్డి, డాక్టర్ బి.వీరేందర్, అశోక్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, నాగిళ్ల రామశాస్త్రి, బిల్ల మహేందర్, పరుశురాములు, వహిద్ గుల్షన్, వల్సపైడి, తాడిచెర్ల రవి, కొలిపాక ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పునర్నిర్మాణంపై కేంద్రం నిర్లక్ష్యం


మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

వేయి స్తంభాల దేవాలయ కల్యాణ మండపం పునర్నిర్మాణ పనులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటే ఎప్పుడో పనులు పూర్తయ్యేవని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. రుద్రేశ్వరాలయాన్ని ఆదివారం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ సందర్శించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. పూజల అనంతరం వారు కల్యాణమండప పనుల్ని పరిశీలించారు. ఆలయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. దేవాలయ పునర్నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయని, కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మూడు సార్లు దేవాలయాన్ని సందర్శించినా.. ఇప్పటికీ అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఈనెల 22న దేవాలయంలో జరిగే ఉగాది వేడుకలకు కేంద్ర పురావస్తుశాఖకు రూ.25 వేల కడితేనే దేవాలయంలో కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతిస్తామని జీఓ జారీ చేయడాన్ని వినయ్‌భాస్కర్ తీవ్రంగా ఖండించారు. 50 ఏళ్లుగా ఇక్కడ ఉగాది ఉత్సవాలు జరుగుతున్నాయని, కొత్తగా సంబంధిత శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఇలాంటి జీఓ ఇవ్వడం బాధకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటయ్య, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, కుడా అధికారులు అజిత్‌రెడ్డి, భీంరావు, కార్పొరేటర్లు చీకటి ఆనంద్, వేముల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, మేకల బాబురావు, తదితరులు పాల్గొన్నారు.